క్లుప్తంగా

ఎంపీటీసీ కిషోర్‌కు పరామర్శ



కంకిపాడు: వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. కంకిపాడు ఎంపీటీసీ సభ్యుడు కోనా కిషోర్ కుమారుడు వైరల్ ఫీవర్‌తో తాడిగడపలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆస్పత్రికి వెళ్లి కిషోర్‌ను మంత్రి శనివారం కలిశారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను ఆత్మీయంగా పలకరించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



ఉంగుటూరు: ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఉంగుటూరు ఎస్‌ఐ రవిచంద్రకుమార్ తెలిపారు. స్థానిక మండల కేంద్రమైన ఉంగుటూరు ప్రధాన కూడలి వద్ద ఓటు హక్కు వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. రూ.50 వేలు కంటే ఎక్కువ నగదు తీసుకు వెళ్లేటప్పుడు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని రైతులకు సూచించారు. అలాగే వాహన చోదకులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఏకలవ్యుని విగ్రహావిష్కరణ

కంకిపాడు: మండలంలోని గొడవర్రు గ్రామ పరిధిలోని ఎస్టీ కాలనీలో ఏర్పాటుచేసిన ఏకలవ్యుని విగ్రహావిష్కరణ మహోత్సవానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏర్పాట్లు చేశాయి. గత పంచాయతీ ఎన్నికల సమయంలో ఆ ప్రాంత వాసులకు ఇచ్చిన హామీకి అనుగుణంగా ఏకలవ్యుని విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఈ విగ్రహాన్ని ఈ నెల 10వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఆవిష్కరించనున్నారు. ఆవిష్కరణ మహోత్సవానికి రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ హాజరుకానున్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, గొడవర్రు గ్రామ యువ నేత కాగిత రాజా రమేష్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ, సరఫరా లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గన్నవరం, మర్లపాలెం, చిన్నఆవుటపల్లి, దావాజిగూడెం, అల్లాపురం, రాజీవ్‌నగర్, ఎస్‌బీఎల్ కాలనీ, దుర్గాపురం ఎయిర్‌పోర్ట్ సిటీ, టీబీ.గూడెం, గొల్లనపల్లి, గోపవరపుగూడెం స్లేట్ స్కూల్, చిక్కవరం ఇండస్ట్రీస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు ప్రైవేట్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలతో సమావేశం

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్యా హక్కుపై ప్రైవేట్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ కె.రవి కుమార్ తెలిపారు. సమావేశంలో ఆర్టీఈ చట్టం ప్రకారం ప్రైవేట్ స్కూల్స్‌లో ఉచిత విద్యకు 25 శాతం సీట్లు కేటాయింపు, విద్యా సంబంధిత సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని అన్ని ప్రైవేట్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలు హాజరుకావాలని కోరారు.

మంగినపూడి బీచ్.. అభివృద్ధికి రీచ్

- పర్యాటక శాఖ నిధులు రూ.1.20 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం
- ఎమ్మెల్యే పేర్ని నాని, కలెక్టర్ రాజాబాబు చొరవతో పనులు
- మరింత ఆహ్లాదాన్ని పంచేలా పచ్చదనం ఏర్పాటు
- రాత్రి సమయంలోనూ విద్యుత్ వెలుగులతో సరికొత్త శోభ



మంగినపూడి బీచ్



మంగినపూడి బీచ్ వద్ద నాటిన కొబ్బరిచెట్లు

చిలకలపూడి(మచిలీపట్నం): ఉమ్మడి కృష్ణా జిల్లాకు మణిహారంలా ఉన్న మంగి నపూడి బీచ్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సాగరుడి చెంత సేద తీరేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే పర్యాటకుల కోసం బీచ్‌ను గడిచిన నాలుగేళ్లలో అంచెలంచెలుగా అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) చొరవతో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టారు. తాజాగా ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో బీచ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే పనులు ఊపందుకున్నాయి.

అభివృద్ధి పనులు ఇలా..

ఆధ్యాత్మికం, పర్యాటకం కలగలిసిన మంగినపూడి బీచ్‌ను నిత్యం ప్రజలు సందర్శిస్తూనే ఉంటారు. సెలవు దినాలు, కార్తిక మాసంలో ఇక్కడ భక్తులు, పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని బీచ్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని), కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ప్రత్యేక చొరవ చూపారు. దీనిలో భాగంగానే పర్యాటక శాఖ నిధులు రూ.1.20 కోట్లు మంజూరు చేయించి బీచ్ అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ నిధుల్లో రూ.15 లక్షలతో బీచ్ ఒడ్డున కొబ్బరి చెట్లు నాటారు. రూ.10 లక్షలతో తాగునీటి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. రూ.60 లక్షలతో దుస్తులు మార్చుకునే గదులను, రూ.40 లక్షలతో విద్యుత్ దీపాలంకరణ పనులు జరుగుతున్నాయి. నిత్యం బీచ్ పరిశుభ్రంగా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు.

సరికొత్త శోభ

ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వ పర్యాటక శాఖ చేపడుతున్న ఈ పనులు బీచ్‌కు సరికొత్త శోభ తీసుకొస్తున్నాయి. అలలకు కొద్ది దూరంలో ఇప్పటికే నాటిన కొబ్బరి చెట్లు సరికొత్త రూపుతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సరికొత్త రోడ్లు బీచ్‌కు కొత్త అందాన్ని తీసుకొచ్చాయి. బీచ్ పరిసరాల్లో నూతనంగా ఏర్పాటు చేసే ఐమాక్స్ విద్యుత్ లైట్లతో రాత్రి సమయంలోనూ సాగర తీరం కనువిందు చేయనుంది. ఒక్కో స్తంభానికి రూ.12 లైట్లు చొప్పున, నాలుగు స్తంభాలను బీచ్ ఒడ్డున ఏర్పాటు చేసి సంధ్యా కాలంలో పర్యాటకులకు ఆహ్లాదాన్ని నింపనున్నారు.

ఆహ్లాదం నిండుగా.. ఆనందం మెండుగా..

మంగినపూడి బీచ్‌కు కొద్ది దూరంలోనే నూతనంగా మచిలీపట్నం పోర్టు నిర్మాణం జరుగుతోంది. పోర్టు పనులు అనతి కాలంలోనే పూర్తి కానున్న నేపథ్యంలో భవిష్యత్తులో పర్యాటకుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని బీచ్ అభివృద్ధికి శరవేగంగా పనులు జరుగుతున్నాయి. బీచ్ పరిసరాల్లోకి పర్యాటకులు చేరుకోగానే కష్టాలన్నీ మర్చిపోయి ఆహ్లాదంతో సేద తీరేలా కార్యాచరణతో పనులు చేపడుతున్నారు.

పక్కా ప్రణాళికతో పనులు



భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మచిలీపట్నం బీచ్‌ను అభివృద్ధిచేస్తున్నాం. అభివృద్ధి పనులు పూర్తయితే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. అక్కడ వ్యాపారాలు విస్తరిస్తాయి. పర్యాటకుల రక్షణ కోసం రానున్న రోజుల్లో పరిసరాల చుట్టూ నిరంతర పర్యవేక్షణకు 360 డిగ్రీల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. పోలీస్ బందోబస్తును పక్కాగా ఏర్పాటు చేస్తాం.

– పి.రాజాబాబు, కృష్ణా జిల్లా కలెక్టర్

వైభవంగా ముగిసిన ప్రభోత్సవం



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగిన ప్రభోత్సవం వైభవంగా ముగిసింది. కొండ చుట్టూ ప్రభల ప్రదక్షిణ ఆలస్యం కావటంతో శనివారం ఉదయం వరకు ప్రభలు ప్రదర్శించారు. గ్రామంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రభోత్సవం నిర్వహించటం కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ సంవత్సరం ఎక్కువ ప్రభలు ఏర్పాటు చేయటంతో ప్రభోత్సవం చాలా ఆలస్యంగా జరిగింది. సహజంగా ప్రభోత్సవం రాత్రి ప్రారంభించి ఉదయం 7 గంటలకల్లా ముగిస్తారు. అయితే ఈ సారి ప్రభలు ఎక్కువగా ఉండటం, భక్తుల రద్దీ విపరీతంగా ఉండటంతో ప్రభోత్సవం ఆలస్యంగా జరిగింది. ఉదయం 11 గంటల వరకు ప్రభోత్సవం చేశారు. కొండ చుట్టూ ప్రభలు ప్రదక్షిణ తరువాతే గ్రామోత్సవం చేశారు. కాగా శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రభోత్సవంలో రెండు ప్రభలకు ప్రమాదం జరిగింది. అయితే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగలేదు. ప్రభలు బరువు ఎక్కువై విరిగి, పక్కకు ఒరిగిపోయాయి. సకాలంలో క్రేన్‌లు తీసుకు వచ్చి ప్రభలను సరి చేశారు. పోలీసులు కూడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోని శాంతి భద్రతలు పర్యవేక్షించారు.

కనులపండువగా గ్రామోత్సవాలు



యనమలకుదురులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



రామలింగేశ్వర స్వామి వార్లు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి గ్రామోత్సవం శనివారం కనులపండువగా జరిగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వార్లకు మండపంలో అర్ధరాత్రి 2.25 గంటలకు కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. అనంతరం ఉదయం 9 గంటలకు స్వామివార్ల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఏర్పాటు చేశారు. కల్యాణం నిర్వహించిన దాతలు రావి ఉదయ్‌కిరణ్, దీప్తి దంపతులతో పాటు గ్రామస్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి వాహనం గ్రామ వీధుల్లో తిప్పారు. స్వామివారి విగ్రహాలు వచ్చిన సమయంలో భక్తులు కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చారు. గ్రామోత్సవం సందర్భంగా భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. కాగా ఆదివారం గ్రామంలో పెద్ద ఎత్తున వసంతోత్సవం నిర్వహించనున్నారు. పవిత్ర కృష్ణానదిలో త్రిశూల స్నానాలు చేస్తారు. రాత్రి స్వామివారికి ధ్వజావరోహణ, మూగబలి, పవళింపు సేవ, పండితులచే ఆశీర్వచనం, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తారు. స్వామివారి ధ్వజావరోహణ సమయంలో స్వామివారికి నివేదించిన నంది ముద్దలు పిల్లలు లేని వారికి సంతానం కోసం అందజేస్తారు.

రామవరప్పాడులో..

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని ఉప ఆలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి వార్ల గ్రామోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి రామలింగేశ్వరస్వామి వార్ల శాంతి కల్యాణాన్ని జరిపారు. రాత్రి 11 గంటల సమయంలో ప్రారంభమైన కల్యాణం అర్ధరాత్రి వరకూ కొనసాగింది. ఈ కల్యాణ మహోత్సవాన్ని భక్తులు ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఆలయంలో ప్రత్యేకంగా ఎల్‌ఈడీ స్కీన్‌లను ఏర్పాటు చేశారు. కల్యాణం అనంతరం శనివారం ప్రత్యేకంగా పలు రకాల పుష్పాలతో అలంకరించిన వాహనంలో స్వామివార్లను ఉంచి జాతీయ రహదారిపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు ఉత్సవ వాహనాన్ని అనుసరిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. పేరంటాలమ్మ ఆలయ ప్రాంగణంలో దాతలు బల్లెం అరిష్ కుమార్, రాణి కమల తేజస్వీ, మేకల నాగేశ్వరరావుల సహకారంతో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాదలో..

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాదలో శనివారం రాత్రి శ్రీ భ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక ఆలయం వద్ద నుంచి అలంకరించిన వాహనంపై స్వామివారు గ్రామంలో పర్యటించి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు కొబ్బరికాయలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసింది.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన



గండిగుంటలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న జోగి రాజీవ్

ఉయ్యూరు: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. మండలంలోని గండిగుంట గ్రామంలో మంత్రి తనయులు జోగి రాజీవ్, జోగి రోహిత్ శనివారం విస్తృతంగా పర్యటించారు. గండిగుంట శివారు ఆనందపురంలో రోహిత్ ఇంటింటి ప్రచారం చేయగా గ్రామంలో రాజీవ్ గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. రాజీవ్ మాట్లాడుతూ ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రభుత్వానికి, సీఎం జగనన్నకు వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. ఎంపీపీ చీలి కల్పన, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, సర్పంచ్ గెత్తం అనుపమ, నాయకులు గెత్తం విజయ్ కుమార్, నందం జోగేశ్వరరావు, మరీదు శంకర్, గొల్లపూడి వేణు తదితరులు పాల్గొన్నారు.

నేడు పోరంకిలో రంగా విగ్రహావిష్కరణ

పెనమలూరు: పోరంకి గ్రామంలో ఆదివారం వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని విగ్రహ కమిటీ అధ్యక్షుడు కాపరౌతు సత్యనారాయణ తెలిపారు. ఆయన శనివారం ఒక ప్రకటనలో వివరాలు తెలుపుతూ నిడమానూరు రోడ్డులో రంగా విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. ఈ విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం మంత్రి జోగి రమేష్ ఆవిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, రాధారంగా మిత్ర మండలి అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీనివాస్ పాల్గొంటారన్నారు. అభిమానులు పాల్గొనాలని కోరారు.

జగనన్నకు అండగా నిలవాలి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న అన్నే శ్రావణ్‌కుమార్, నాయకులు

పెనమలూరు: రానున్న ఎన్నికల్లో జగనన్నకు అందరు అండగా నిలవాలని తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్ కోరారు. కానూరు సనత్‌నగర్ డీవీసీ రోడ్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

కులమతాలకు అతీతంగా పథకాల అమలు

ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. గత పాదయాత్రలో ప్రజలకు జగనన్న ఇచ్చిన హామీలు నవరత్నాల రూపంలో అమలు చేశారన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా జగనన్న అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. జగనన్న పాలనలో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఎంతో ఆనందంగా ఉన్నాయన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు పఠాన్‌అహ్మద్, నాయకులు వేమూరి బాలకృష్ణ, షాబు, అంగిరేకుల సీతారామయ్య, కాకర్ల సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



పెనమలూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి సుంకర రాము తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ పిలుపు మేరకు నారీశక్తి – ఫిట్ నెస్ రన్ కార్యక్రమం కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. రాము మాట్లాడుతూ.. మహిళలకు క్రీడ ల్లో రాణించి వారి శక్తి సామర్థ్యాలను నిరూపించాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. విద్యార్థినులకు పరుగు పందెం నిర్వహించారు. విద్యార్థినులు మేరీరాణి, ధనలక్ష్మి, భవ్యశ్రీ పోటీలో గెలుపొందారు. 60 మంది విద్యార్థినులకు టీ షర్టులు, క్యాప్‌లు, కాఫీ మగ్ అందజే శారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను ఎదుర్కొనే సత్తా చంద్రబాబుకు లేదు



మాట్లాడుతున్న నూరుద్దీన్

రామవరప్పాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే సత్తా చంద్రబాబుకు లేదని అందుకే టీడీపీ, జనసేన, బీజేపీల అక్రమ కలయికతో పోటీకి వస్తున్నాడని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి సయ్యద్ నూరుద్దీన్ విమర్శించారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని మైనార్టీ సెల్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.

జగన్ వెంటే ముస్లింలు

నూరుద్దీన్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్ని కుయుక్తులు పన్నినా రాష్ట్ర ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న జగన్‌ను ఏమి చేయలేరన్నారు. ముస్లింలకు టీడీపీ, జనసేన వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమయ్యారన్నారు. చంద్రబాబు ఓటుకు నోటు, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులు తప్పించుకునేందుకు బీజేపీతో కలిశారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు రా కదలిరా అంటే ఒక్కరూ వచ్చే పరిస్థితి లేదన్నారు. అమిత్ షాతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ చీకటి ఒప్పందం చేసుకున్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. ముస్లింల అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి జగన్ మోహన్‌రెడ్డి అని ముస్లిం సోదరులంతా జగన్‌వైపే నిలబడ్డారన్నారు. 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ గెలుపు జెండా ఎగురవేయడం ఖాయమని టీడీపీ, జనసేన తట్టా బుట్టా సర్దుకోవాల్సిందేనని చెప్పారు.

ఖాళీ స్థలాల్లో చెత్త డంపింగ్



కంకిపాడు: ఖాళీ స్థలాల్లో చెత్త డంప్ చేసి వ్యర్థాలను కాల్చటం వల్ల కాలుష్యం పెరిగి పునాదిపాడు వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని శారదానగర్ లే అవుట్‌లో ఖాళీస్థలాలు ఉన్నాయి. ఈ లే అవుట్‌కు సమీపంలో పలువురు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. ఆరేళ్లుగా పంచాయతీ సిబ్బంది గ్రామంలో సేకరించిన చెత్త, వ్యర్థాలను సామాజిక స్థలంలో వేస్తున్న నెపంతో లే అవుట్‌లోని ఖాళీస్థలాలు, ప్రైవేటు వ్యక్తుల ఖాళీ స్థలాల్లో డంప్ చేస్తున్నారు. దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. చెత్త డంపింగ్ నిలుపుదల చేయాలని, లేనిపక్షంలో న్యాయపోరాటం చేస్తామని స్థానికులు స్పష్టం చేశారు.

గ్యాస్ ధర తగ్గింపుపై బీజేపీ ఎన్నికల నాటకం

కంకిపాడు: వంట గ్యాస్ ధర తగ్గింపుపై బీజేపీ ఎన్నికల నాటకానికి తెరదీసిందని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా విమర్శించారు. ఈడుపుగల్లులోని సంఘ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందటం కోసమే కేంద్రం గ్యాస్ ధర రూ.100 తగ్గించిందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రూ.500లోపు ఉన్న వంట గ్యాస్ ధర ఏకంగా రూ.1150కి చేరిందని చెప్పారు. పేద, మధ్యతరగతి వర్గాలపై ఆర్థిక భారం అధికంగా మోపిన ఘనత కేంద్రంలోని బీజేపీ సర్కారుదేనన్నారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినా గ్యాస్ ధర తగ్గించకుండా పేదల కష్టాన్ని పీల్చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ మాబిని, రాష్ట్ర కార్యదర్శి షేక్ మీరాబి, జిల్లా అధ్యక్షురాలు షేక్ రంజాన్‌బి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు షేక్ కరిష్మాబి, సభ్యులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు

కృష్ణలంక(విజయవాడతూర్పు): త్వరలో జరగనున్న లోక్‌సభ, శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కృష్ణలంకలోని పలు వీధుల్లో శనివారం కృష్ణలంక పోలీస్‌స్టేషన్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల నిమిత్తం ఏసీపీ రత్నరాజు నేతృత్వంలో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం కవాతు నిర్వహించారు.